క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



చెల్లెంపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

బలిజిపేట: ఏనుగుల దాడిలో మృతి చెందిన అడపదేశినాయుడు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రవి కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడులు మృతుడి కుటుంబాన్ని ఓదార్చి ప్రభుత్వపరంగా అందాల్సిన పరిహారాలు త్వరగా అందేవిధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటరమణ, కె.లక్ష్మణరావు, ఎస్.భాస్కరరావు, ఎ.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిని నిల్వ ఉంచరాదు



మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవకుమార్

మక్కువ: ఇంటి పరిసరాల్లో మురుగునీటిని నిల్వ ఉంచరాదని ఎంపీడీఓ పి.దేవకుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జాతీయ కీటకజనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ దేవ కుమార్, వైద్యాధికారి హరికృష్ణ మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధికి సంబంధించిన మందులను ఈనెల 15, 16 తేదీల్లో ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో, దోమలు విజృంభించనున్నట్లు తెలిపారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది

పార్వతీపురం: వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కృష్ణవేణి హితవు పలికారు. మండలంలోని కె.ములగ పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, సుగర్ వ్యాధులతోపాటు క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం విశ్వనాథం మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల నుంచి సులువుగా బయటపడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, హెచ్‌వీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేటలో వైద్యారోగ్యశాఖ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తి

బలిజిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బలిజిపేట, గలావల్లి, అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది సమావేశాన్ని ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధిపై మూడురోజుల పాటు నిర్వహించాల్సిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం నుంచి నిర్వహించే కార్యక్రమంలో ఆల్బెండజోల్, డీఈసీ మాత్రలు ఇంటింటికి పంపిణీ చేయాలని సూచించారు. ఏఎన్‌ఎం, వలంటీర్, ఆశ వర్కర్లు ఈ మాత్రలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్, గలావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ వెంకటరమణ, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు



సమావేశంలో పాల్గొన్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: శాసనమండలి ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు కోరారు. ఈ మేరకు మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, గతంలో కంటే ఓటర్లు పెరిగినందున పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెంచినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో నాలుగు కేంద్రాల పేర్లు మాత్రమే మార్పు చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తుచేసుకున్న ఓటర్ల దరఖాస్తులను పరిశీలించి, సప్లిమెంటరీ లిస్టు జారీచేయనున్నట్లు తెలిపారు. ఓటరు లిస్టులో చేర్పులు, ఫిర్యాదుల మేరకు డూప్లికేట్, అనర్హుల తొలగింపు జరుగుతోందని చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మరిశర్ల బాపూజీనాయుడు, డి.శ్రీనివాసరావు, భాస్కరరావు, వెంకటనాయుడు, వేణు, ఆర్.లోవరాజు, సూపరింటెండెంట్ డి.రవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

- జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి



పార్వతీపురం టౌన్: వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి అని జిల్లా రవాణా శాఖాధికారి సి.మల్లికార్జున రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన డీటీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2014వ సంవత్సరం నుంచి నంబర్ ప్లేట్స్ కోసం ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్నప్పటికీ హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ వాహనానికి అమర్చుకోకుండా సుమారు 4200 వాహనాలు పార్వతీపురం మన్యం జిల్లాలో తిరుతున్నాయన్నారు. వాటికి సంబంధించిన నంబర్ ప్లేట్స్ రాయగడ రోడ్, సూర్యపీఠం ఎదురుగా గల హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ ఆఫీస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావున 2014 నుంచి రిజిస్ట్రేషన్ జరిగి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ తీసుకోని వాహనదారులు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ ఆఫీస్‌లో బి.ప్రసాద్, మొబైల్ నంబర్ 8106805850ను సంప్రదించి వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ అమర్చుకోవాలని స్పష్టం చేశారు. 2014 వ సంవత్సం నుంచి రిజిస్ట్రేషన్ జరిగి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ లేకుండా జిల్లాలో తిరుగుతున్న వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే రూ.1000 వరకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఆర్.వెంకంపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ జనకీరాం

సీతానగరం: ప్రభుత్వం మంజూరుచేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ ఏఈ జానకీరాం కోరారు. ఈ మేరకు మంగళవారం కాశీపేట, ఆర్ వెంకంపేట గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆర్.వెంకంపేటలో మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండలంలోని కాశీపేటలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారని తెలియజేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేస్తున్న కృషి ఫలితంగా పేదవారి సొంతింటి కల నెరవేర్చడానికి అర్హులైన పేదలందరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇంటినిర్మాణానికి అవసరమైన ముడిసరుకులు, సకాలంలో ఇళ్ల బిల్లులు సమకూర్చడంతో పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే బుడ్డిపేట, జానుమల్లువలస, జోగింపేట, సీతానగరం, బూర్జ, లక్ష్మీపురం, నిడగల్లు, పెదభోగిలి, వెంకటాపురం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ సత్యంనాయుడు, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ సహాయకులు గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

బర్లిలో పొలంబడి



బర్లిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

బలిజిపేట: మండలంలోని బర్లి గ్రామంలో మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఏఓ శ్రావణ్ ఆధ్వర్యంలో రైతులకు తగు సూచనలు చేశారు. ఆకులు, పిలకల కత్తిరింపు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తిపై వివరించారు. పొలంలో పీక పురుగు, అగ్గి తెగులును గుర్తించారు. వాటికి ఎంత మోతాదులో ఎరువుల వాడకం ఉండాలో వివరించారు. ప్రస్తుతం అగ్గి తెగులు ఉన్న పొలాల్లో ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120గ్రాముల ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. తెగులు తగ్గుముఖం పట్టిన తరువాత రెండవసారి వేయాల్సిన యూరియా 30కిలోల లోపు వేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతీ పంటకు ఈ–క్రాప్ తప్పనిసరి

గరుగుబిల్లి: వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ సహాయ సంచాలకులు బి.లక్ష్మణబాబు అన్నారు. మండలంలోని లఖనాపురం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసిన పెసర, మినుము, నువ్వులు తదితర పంట క్షేత్రాలను పరిశీలించారు. రైతులు వేసిన ప్రతీ పంటను విధిగా ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే బీమా వర్తిస్తుందని, అలాగే సున్నావడ్డీ పథకం వర్తిస్తుందని, గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. ఆయన వెంట ఏడీఏ వెంకటేష్, ఏఓ ఆర్.విజయభారతి, డీపీఎం షణ్ముఖరాజు ఉన్నారు.

విద్యార్థిని మృతిపై ఎంపీడీఓ ఆరా



ఉలిపిరి వసతి గృహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కొమరాడ: మండలంలోని ఉలిపిరి బాలకోన్నత పాఠశాలను ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు మంగళవారం సందర్శించారు. వసతి గృహం విద్యార్థిని కోలక సుమిత్ర మృతికి గల కారణాలను హెచ్ఎం లక్ష్మీకాంతంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహం పరిసరాలు, వంటగది, డార్మిటరీ, భోజనాలను పరిశీలించారు. మృతి చెందిన విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆమె స్నేహితుల వద్ద ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

కొమరాడ: గిరిజన విద్యార్థి కోలక సుమిత్ర మృతిపై సమగ్ర విచారణ చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సరేష్ మంగళవారం డిమాండ్ చేశారు. వసతి గృహంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పట్టేవారు కరువైయ్యారన్నారు. విద్యార్థుల మరణాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

సీతంపేట: పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే విద్యార్థిని కె.పవిత్ర ప్రాణాలు బలిగొందని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కూరంగి గోపి, మండల సీపీఐ కార్యదర్శి కె.జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆమె కుటుంబానికి తక్షణం రూ.10 లక్షల పరిహారం చెల్లించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై సరైన పర్యవేక్షణ, హాస్టల్‌లో సరైన నిర్వాహణ లేక ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

నేటి నుంచి మందుల పంపిణీ

సాలూరు: బోదకాలు, నులి పురుగుల నివారణ మందులను బుధవారం నుంచి ఈ నెల 17 వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ శంకర రావు, ఎంపీడీఓ పార్వతి అన్నారు. మున్సిపల్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో వేర్వేరుగా వారు మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖల సమన్వయంతో ఈ మందులను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. వీటి ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు సురేష్‌చంద్రదేవ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న వాహన చోదకుల కష్టాలు

సీతానగరం: మండలంలోని పెదంకలాంవద్ద వాహనచోదకులు దీర్ఘ కాలంగా రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తీరనున్నాయి. మక్కువ- అజ్జాడ రోడ్డుపై పెదంకలాం వద్ద లక్షలాది రూపాయలతో శ్లాబ్ కల్వర్టు మంజూరు కావడంతో ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. పెదంకలాం మీదుగా గరుగుబిల్లి, బలిజిపేట మండలాలకు చెందిన వాహనాలు నిరంతరం ఈ రోడ్డుపై తిరుగాడుతుంటాయి. వరద నీరు నిరంతరం శిథిలమైన కల్వర్టు మీదుగా ప్రవహించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మేరకు బలిజిపేట గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజలు పడుతున్న ఇబ్బందులకు స్పందించి తక్షణమే కల్వర్టు నిర్మించాలని సంబంధిత ఉన్నతాధికారులను కోరిన మేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సాదాసీదాగా మండల సమావేశం



మండల సమావేశంలో పాల్గొన్న సభ్యులు

సాలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మండల సర్వసభ్య సమావేశం ఎటువంటి చర్చలు, తీర్మానాలు లేకుండా సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండంతో అభివృద్ధి పనుల గుర్తింపు, సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చలు, తీర్మానాలు చేయలేదు. సమావేశంలో వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఇతర సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 14 రకాల వైద్యపరీక్షలు



దోకిశీల గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి సాహితి

- వైద్యాధికారిణి సాహితి

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని, గ్రామాల్లో 14రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని వైద్యాధికారిణి సాహితి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని దోకిశీల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి 15రోజులకోసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరాల్లో 14రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని చెప్పారు. రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలి



నారన్నాయుడువలసలో పాఠశాలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర కమిటీ

బలిజిపేట: మండలంలోని పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని పాఠశాలల పర్యవేక్షణ రాష్ట్ర బృందం సభ్యుడు ఎం.రామకృష్ణ సూచించారు. మండలంలోని నారన్నాయుడువలస, వంతరాం, బలిజిపేట ఉన్నత పాఠశాలలను బృందం మంగళవారం పరిశీలించి పాఠశాలలో కార్యక్రమాల అమలు తీరును పరిశీలించింది. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి సూచనలు, సలహాలు అందించారు. పాఠశాలలకు అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారిలో ఉన్న నైపుణ్యాలను పరీక్షించారు. వాటన్నింటిపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఎస్.జయకృష్ణ, ఏఎంఓ రాజేశ్వరి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే క్యాన్సర్ రహిత సమాజ స్థాపన



క్యాన్సర్‌వ్యాధిపై అవగాహనకు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

సీతానగరం: వ్యాయామం, సైక్లింగ్, యోగాలను దైనందిక జీవితంలో అలవాటు చేసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యమేళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆర్‌సీహెచ్ వైద్యాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది నిర్వహించిన క్యాన్సర్ అవగాహన ర్యాలీలో డాక్టర్ జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్ల ద్వారా క్యాన్సర్ దూరం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే క్యాన్సర్ వ్యాధి రహిత సమాజాన్ని స్థాపించవచ్చన్నారు. సరైన జీవన శైలి,ఆహారపు అలవాట్ల ద్వారా క్యాన్సర్ దరిచేరకుండా చేయవచ్చని, కొన్ని ప్రాథమిక లక్షణాల ద్వారా ముందుగానే గుర్తించి చికిత్స ఇవ్వడంతో నయం చేయవచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌కు గురికాకుండా జాగ్రత్తపడాలని తెల్లబట్ట తరచూ అవ్వడం, రసితో కూడిన రక్తస్రావం, రుతుక్రమం తర్వాత కూడా రక్తస్రావం జరగడం, రొమ్ములో గడ్డలు ఉండడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, పాప్‌స్మియర్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చని అన్నారు. పొగాకు, ధూమపానం, మద్యపానం, గుట్కా, తంబాకు తరచుగా వాడడంతోనే క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉందని సరైనజీవన శైలి, వ్యాయామం, సైక్లింగ్, యోగా, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహారంలో తాజా ఆకుకూరలు, పండ్లు మొదలైన వాటి ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సూర్యదేముడు, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఈఓ వెంకటరావు,హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు, ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో గ్రామాల్లో సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న సామాజికతనిఖీ జిల్లా సమన్వయకర్త వినోద్‌కుమార్

సీతానగరం: మండలంలో వివిధ పద్దులతో చేసిన అభివృద్ధి పనుల ఖర్చులపై ప్రారంభించిన సామాజిక తనిఖీలను వివిధ శాఖల అధికార సిబ్బంది, ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు సమన్వయంతో చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ నాగలక్ష్మి అధ్యక్షతన సెర్ప్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, పశువైద్య, ఉపాధి హామీ పథకాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమన్వయసమావేశం జరిగింది.ఈ మేరకు ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ పథకాల ద్వారా మంజూరుచేసిన నిధులతో జరిగిన అభివృద్ధి పనుల ఖర్చులు, నాణ్యత, వేతనం కిట్టుబాటు, పింఛన్ల మంజూరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సమగ్రమైన సమాచారం సామాజిక తనిఖీ కోసం వచ్చిన వారికి ఇవ్వాలన్నారు.

గ్రామస్తులు సహకరించాలి

సెర్ప్ డీఆర్పీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ వివిధ పథకాల నిధులతో గ్రామాల్లో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని నివేదిక వచ్చిందన్నారు. నివేదిక ఆధారంగా వివిధ రకాల పనులకు వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలో ఖర్చు చేసినట్లు చెప్పారు. అప్పట్లో చేసిన ఖర్చుల వివరాలు, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, వేతనాల గిట్టుబాటు, ప్రజావసరాలు, పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అర్హులెవరైనా సంక్షేమ పథకాలను పొందలేనివారున్నారా? తదితర అంశాలపై తమ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. వాటిని మండల రిసోర్స్‌పర్సన్‌లు రెండవ పర్యాయం పరిశీలించి పెట్టుబడులు, ఖర్చులు, తప్పిదాలను పరిశీలించి మండలస్థాయిలో జరగనున్న సామాజిక తనిఖీల్లో చర్చిస్తామని వివరించారు. గ్రామాల్లోకి సామాజిక తనిఖీ కోసం వచ్చిన ఆడిట్ సిబ్బందికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్‌లు, ఇంజినీరింగ్ అధికారులు, పశువైద్యులు ఇతరశాఖల అధికార సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారుల పర్యవేక్షణలో డీఈసీ మాత్రలు పంపిణీ చేయాలి

సీతానగరం: నులిపురుగులు, బోదకాలు నివారణ మందులు మండలంలో అందరికీ పంపిణీ చేయాలని ఎంపీడీఓ కృష్ణ మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం ఆర్‌సీహెచ్ డాక్టర్ అరుణకుమారి, పెదంకలాం, పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ పర్యవేక్షణలో వైద్యారోగ్యశాఖ అధికార సిబ్బందికి అల్బెండజోల్, డీఈసీ మాత్రల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి మాట్లాడుతూ నులిపురుగులు, బోదకాలు నివారణమందుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని కోరారు. వైద్యాధికారుల పర్యవేక్షణలో వైద్యసిబ్బంది బుధవారం ప్రతి ఇంటికీ వెళ్లి మందులు అందజేయాలని, మాత్రలు వేసుకోని వారందరికీ ఈ నెల 16, 17తేదీల్లో పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ 2నుంచి 5 సంవత్సరాల వయస్సుగల చిన్నారులకు వంద మిల్లీగ్రాముల డీఈసీ మాత్ర ఒకటి, నాలుగు వందల మిల్లీ గ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని సూచించారు. 6 నుంచి 14సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు రెండు వందల మిల్లీగ్రాముల డీఈసీ మాత్రలు రెండు, నాలుగు వందల మిల్లీగ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని కోరారు. 15 సంవత్సరాల వయస్సు పైబడిన వారికి మూడువందల మిల్లీగ్రాముల డీఈసీ మాత్రలు మూడు, నాలుగు వందల మిల్లీగ్రాముల అల్బెండజోల్ మాత్ర ఒకటి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వర్మ, వైద్యసిబ్బంది, 21గ్రామ సచివాలయాల వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.